


EVENING EDITION
నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com
4PM
www.suryaa.com
శుక్రవారం
29 నవంబర్ 2024
పేజీలు: 02




## పుష్ప, శ్రీవల్లిల మాస్ జాతర..

ప్రస్తుతం పాన్ ఇండియా లెవెల్లో ఆడియెన్స్ ఓ రేంజ్ లో ఎదురు చూస్తున్న వన్ అండ్ ఓన్లీ బిగ్ ప్రాజెక్ట్ ఏదన్నా ఉంది అంటే అది ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ రష్మిక మందన్న కాంబినేషన్ లో దర్శకుడు సుకుమార్ తెరకెక్కించిన మాసివ్ చిత్రం "పుష్ప 2 ది రూల్" అనే చెప్పాలి. మరి ఎన్నో అంచనాలు సెట్ చేసుకున్న ఈ సినిమా నుంచి ఒకో సాంగ్ ఒక దాన్ని మించి మరొకటి హిట్ కాగా రీసెంట్ గా అయితే ఈ సినిమా నుంచి నాలుగో సాంగ్ క్రేజీ రెస్పాన్స్ ని తెచ్చుకుంది. మలయాళ ఈవెంట్ లో అనౌన్స్ చేసిన ఆ పాటనే "పీలింగ్స్". పక్కా మలయాళ బీట్స్ లో దేవిశ్రీ ప్రసాద్ ఇచ్చిన ఈ సాంగ్ అక్కడే ఓ రేంజ్ లో జనానికి ఎక్కేసింది. దీనితో ఈ సాంగ్ ఎప్పుడా అని ఎదురు చూస్తున్న అభిమానులకి ఇపుడు సాలిడ్ ప్రోమోతో డేట్ వచ్చేసింది. దీనితో ఈ అవైటెడ్ సాంగ్ ఈ డిసెంబర్ 1న విడుదల చేస్తున్నట్టుగా తేల్చేసారు. మరి ఈ సాంగ్ ఎలాంటి రికార్డులు బద్దలు కొడుతుందో చూడాల్సిందే.




### అబద్ధాలను అల్లటంలో జగన్‌కు
## ఆస్కార్ అవార్డు ఇవ్వాలి

సెకీతో విద్యుత్ ఒప్పందాలలో అబద్ధాలను అందంగా అల్లటంలో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి ఆస్కార్ అవార్డు ఇవ్వాలని వైఎస్ షర్మిల విమర్శించారు. శాలువలు, సన్మానాలు, అవార్డులు కోరుకొనే ముందు జగన్ కొన్ని ప్రశ్నలకు సమాధానం చెప్పాలని ట్విటర్‌లో డిమాండ్ చేశారు. 2021 మే నెలలో సెకీ వేసిన వేలంలో యూనిట్ ధర గరిష్టంగా రూ.2.14 పైసలు ఉంటే, రూ 2.49 పైసలకు కొన్నందుకు శాలువలు కప్పాలా ? అంటూ ఎద్దేవా చేశారు. అదానీ వద్ద గుజరాత్ రాష్ట్రం యూనిట్ ధర రూ 1.99 పైసలకే కొంటే.. అదే కంపెనీ నుంచి 50పైసలు ఎక్కువ పెట్టి, రూ.2.49 పైసలకు కొన్నందుకు మీకు సన్మానాలు చేయాలా ? అదానీతో ఒప్పందానికి దేశంలో ఏ రాష్ట్రం ముందుకు రాకుంటే. ఆగమేఘాల మీద ఒప్పందానికి మీరు ముందుకు వచ్చినందుకు మీకు అవార్డులు ఇవ్వాలా ? అంటూ ప్రశ్నల వర్షం కురిపించారు. ట్రాన్స్మిషన్ ఛార్జీల భారం అక్కడ ఇక్కడ లేకుంటే గుజరాత్‌కి ఇచ్చిన రేటు ప్రకారం ఏపీకి రూ 1.99 పైసలకు అదానీ ఎందుకు ఇవ్వలేదని పేర్కొన్నారు. ఒక ముఖ్యమంత్రిని ఒక వ్యాపారవేత్త అధికారికంగా కలిస్తే గోప్యత పాటించడం దేశంలో ఎక్కడైనా ఉందా ? దమ్ముంటే జగన్ మోహన్ రెడ్డి సమాధానం చెప్పాలని కోరారు. రూ.1,750 కోట్లు ముడుపులు ఇవ్వడం చరిత్ర అదానీతో ఒప్పందం రాష్ట్రంలోనే కాదు అంతర్జాతీయంగా చరిత్రనేని, రూ.1750 కోట్లు నేరుగా ముఖ్యమంత్రికి ముడుపులు ఇవ్వడం చరిత్రేనని ఆరోపించారు. ఎవడు కొనేందుకు ముందుకు రాని విద్యుత్‌ను బంపర్ ఆఫర్‌గా ప్రకటించుకోవడం , గంటల్లోనే క్యాబినెట్ పెట్టి, ప్రజా అభిప్రాయం లేకుండా గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం , అదానీ కోసం అన్ని టెండర్లు రద్దు చేయడం చరిత్ర. ఒక వ్యక్తి స్వప్రయోజనాల కోసం ఏపీ రాష్ట్ర ప్రజల నెత్తిన రూ.1.67 లక్షల కోట్ల భారాన్ని మోపడం చరిత్రేనని విమర్శించారు. అమెరికా దర్యాప్తు సంస్థలు ఇచ్చిన రిపోర్ట్ లో నాపేరు ఎక్కడుందని బుకాయిస్తున్నారని షర్మిల ఆరోపించారు. ఏపీ సీఎంగా అంటే ఆనాడు మీరు కారా. ఆ కుర్చీలో మీరు కాకుండా మిమ్మల్ని నడిపించే వాళ్లు కూర్చున్నారా ? సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ముడుములు ముట్టాకే ఒప్పందాలు చేసుకున్నారని ఓ వంద పేజీల రిపోర్ట్ కూడా ఇచ్చాయని వెల్లడించారు. గత టీడీపీ ప్రభుత్వం ఎక్కువ ధరకు పీపీఎల్ చేసుకుందని, రూ.35వేల కోట్ల భారం వేసిందని ఆరోపించిన జగన్ అధికారంలో ఉండి ఏం చేశారని ప్రశ్నించారు. టెండర్లను ఎందుకు రద్దు చేయాలేదని , ఎందుకు విచారణ జరిపించలేదని ట్విటర్‌లో నిలదీశారు. నిజంగా అదానీతో చేసుకున్న ఒప్పందంలో అవినీతి లేకుంటే, అదానీ వల్ల ఆర్థికంగా లబ్ధి పొందలేదని అనుకుంటే బైబిల్ మీద ప్రమాణం చేయాలని వైఎస్ షర్మిల డిమాండ్ చేశారు.




### నేడు రాష్ట్రవ్యాప్తంగా
## బీఆర్ఎస్ దీక్షా దివస్

తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు కోసం కేసీఆర్ 15 ఏళ్ల క్రితం సరిగ్గా ఇదే రోజు ఆమరణ నిరాహారదీక్షకు శ్రీకారం చుట్టారు. ఈ విషయాన్ని గుర్తుచేసుకుంటూ బీఆర్ఎస్ ఏటా నవంబర్ 29న దీక్షా దివస్ నిర్వహిస్తోంది. ఇవాళ అన్ని జిల్లా కేంద్రాల్లో ర్యాలీలు, సామాజిక, సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టనుంది. 2009, నవంబర్ 29 నుంచి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రకటన వచ్చే వరకూ 11 రోజులపాటు కేసీఆర్ దీక్షను కొనసాగించారు.

### చరిత్ర సృష్టించిన
## జాన్సెన్

శ్రీలంకతో జరుగుతున్న తొలి టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో 7 వికెట్లు పడగొట్టిన సౌతాఫ్రికా బౌలర్ మార్కో జాన్సెన్ చరిత్ర సృష్టించారు. ఓ ఇన్నింగ్స్‌లో 7 ఓవర్ల లోపే(6.5) 7 వికెట్లు తీయడం 120 ఏళ్లలో ఇదే తొలిసారి. చివరగా 1904లో ఆస్ట్రేలియా బౌలర్ హ్యూయ్ ట్రంబుల్ ఇంగ్లండ్‌పై 6.5 ఓవర్లలో 28 రన్స్ ఇచ్చి 7 వికెట్లు తీశారు. కాగా ప్రస్తుత టెస్టులో సౌతాఫ్రికా 281 పరుగుల ఆధిక్యంలో ఉంది.

## మరోసారి ఢిల్లీకి సీఎం రేవంత్

సీఎం రేవంత్ రెడ్డితో సహా పలువురు కీలక నేతలు ఇవాళ ఢిల్లీ వెళ్లనున్నారు. మధ్యాహ్నం జరగనున్న కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశంలో పాల్గొననున్నారు. సీఎం వెంట మంత్రి దామోదర రాజనర్సింహ, టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ఢిల్లీకి పయనం కానున్నారు. దీపాదాస్ మున్షీ, వంశీచంద్ రెడ్డి తదితరులు కూడా ఈ భేటీకి హాజరుకానున్నారు.

## టెన్త్ విద్యార్థులకు గ్రేడింగ్ విధానం తొలగింపు

టెన్త్ పరీక్షల్లో ఇంటర్నల్ మార్కులను తొలగించిన విద్యాశాఖ గ్రేడింగ్ విధానాన్నీ తొలగించాలని నిర్ణయించింది. ఏ1, ఏ2, బి1, బి2 గ్రేడులకు బదులు మార్కులను ప్రకటించనుంది. అలాగే ఆన్సర్ షీట్లలో కూడా మార్పులు చేసింది. 4 పేజీల బుక్ లెట్+అడిషనల్ పేపర్లకు బదులు 24 పేజీల ఆన్సర్ బుక్ లెట్లను ఇవ్వనుంది. సైన్స్ పేపర్లకు ఒక్కో దానికి 12 పేజీల ఆన్సర్ బుక్ లెట్ ఇవ్వాలని నిర్ణయించింది.

## కులగణన తర్వాత రిజర్వేషన్లలో మార్పులు!

సమగ్ర కులగణన తర్వాత పంచాయతీ ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లలో మార్పులు చేర్పులపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోనుంది. బీసీ రిజర్వేషన్లను ప్రభుత్వపరంగా పెంచే అవకాశాలను పరిశీలిస్తోంది. అయితే సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం రిజర్వేషన్లు 50% మించకూడదనే నిబంధన ఉన్నందున ప్రత్యామ్నాయాలపై కూడా ఆలోచిస్తున్నట్లు సమాచారం. ఈ ఏడాది జనవరి 31న సర్పంచ్‌ల పదవీకాలం పూర్తవ్వగా పంచాయతీల్లో ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతోంది.




## ఢిల్లీ పాఠశాలకు బాంబు బెదిరింపులు

దేశ రాజధాని ఢిల్లీలో గురువారం భారీ పేలుడు సంభవించిన విషయం తెలిసిందే. ఈ ఘటన మరవకముందే తాజాగా ఓ పాఠశాలకు బాంబు బెదిరింపులు రావడం ఇప్పుడు కలకలం రేపుతోంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రోహిణి ప్రాంతంలో ఉన్న ఓ ప్రైవేటు పాఠశాలకు శుక్రవారం ఈ బెదిరింపులు వచ్చాయి. ఆగంతకులు 10:57 సమయంలో ఈమెయిల్ ద్వారా బెదిరింపులకు పాల్పడ్డారు. వెంటనే అప్రమత్తమైన పాఠశాల యాజమాన్యం.. పోలీసులకు సమాచారం ఇచ్చింది. అగ్నిమాపక శాఖ అధికారులు, పోలీసులు వెంటనే అక్కడికి చేరుకుని.. విద్యార్థులను, సిబ్బందిని బయటకు పంపించారు. అనంతరం బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ సాయంతో పాఠశాల ప్రాంగణంలో తనిఖీలు చేపట్టారు. అయితే, ఈ తనిఖీల్లో ఎలాంటి పేలుడు పదార్థాలు, అనుమానాస్పద వస్తువులూ లభించలేదు. ఈ మేరకు ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ ఘటనతో విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు.

**ఢిల్లీలో బాంబు పేలుడు**

ఢిల్లీ ప్రశాంత్ విహార్‌లోని పీవీఆర్ మల్టీప్లెక్స్‌కు సమీపంలో గురువారం ఉదయం స్వల్ప తీవ్రత గల బాంబు పేలింది. దీంతో స్థానికులు, మల్టీప్లెక్స్‌కు వచ్చిన ప్రజలు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. పీవీఆర్ మల్టీప్లెక్స్‌కు కొద్ది మీటర్ల దూరంలోనే జరిగిన పేలుడులో ఆటో డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయని ఢిల్లీ పోలీసులు వెల్లడించారు. ఘటనా స్థలం నుంచి తెల్లటి పౌడర్ లభ్యమైందని, మరిన్ని వివరాల కోసం దర్యాప్తు చేపట్టామని పోలీస్ అధికారి ఒకరు చెప్పారు. ప్రశాంత్ విహార్‌లోని ఇదే ప్రాంతంలో అక్టోబర్ 20న సీఆర్‌పీఎఫ్ స్కూల్ గోడను ఆనుకొని భారీ పేలుడు ఒకటి సంభవించింది. ఢిల్లీలో శాంతి భద్రతలను కాపాడటంలో కేంద్రం విఫలమైందని ఢిల్లీ సీఎం ఆతిశీ ఆరోపించారు.

### నాని మాసివ్ ప్రాజెక్ట్‌లో
## రమ్య కృష్ణ

రీసెంట్ గానే నాచురల్ స్టార్ నాని హీరోగా నటించిన సాలిడ్ హిట్ చిత్రం "సరిపోదా శనివారం" తో తాను హ్యాట్రిక్ కొట్టిన సంగతి తెలిసిందే. మరి ఈ చిత్రం తర్వాత తన నుంచి మరింత స్ట్రాంగ్ లైనప్ వస్తుండగా ఈ లైనప్ లో తన "దసరా" దర్శకుడు శ్రీకాంత్ ఓదెలతో చేస్తున్న భారీ ప్రాజెక్ట్ "ప్యారడైజ్" కూడా ఒకటి. మరి దీనిపై అనౌన్సమెంట్ తోనే మంచి హైప్ సెట్టవ్వగా ఇపుడు శరవేగంగా షూటింగ్ కూడా జరుపుకుంటుంది. అయితే ఈ సినిమాలో బాహుబలి నటి రమ్యకృష్ణ మంచి పాత్రలో కనిపించనున్నట్టుగా తెలుస్తుంది. రమ్యకృష్ణ ఈ సినిమాలో నానికి తల్లి పాత్ర పోషించనున్నట్టుగా ఇపుడు టాక్. మరి ఈ సినిమాలో తన రోల్ ఏ రేంజ్ లో ఉంటుందో చూడాలి. ఇక ఈ చిత్రం కాకుండా నాని సాలిడ్ క్రైమ్ థ్రిల్లర్ ఫ్రాంచైజ్ "హిట్ 3" లో కూడా నటిస్తున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రాన్ని కూడా తాను పరిచయం చేసిన యువ దర్శకుడు శైలేష్ కొలను తెరకెక్కిస్తున్నాడు.



### వెనక్కి తగ్గిన రేవంత్ సర్కార్..
## లగచర్ల భూసేకరణ నిలిపివేత

గిరిజన, దళిత పేద రైతులకు మద్దతుగా బీఆర్ఎస్ చేసిన పోరాటంతో రేవంత్ రెడ్డి సర్కార్ దిగొచ్చింది. లగచర్ల భూసేకరణను నిలిపివేసింది. ఈ మేరకు శుక్రవారం నాడు ఒక ప్రకటన విడుదల చేసింది. లగచర్ల ఫార్మాపై అభిప్రాయ సేకరణకు వెళ్లిన కలెక్టర్, అధికారులపై రైతుల దాడి ఘటనను ముందుగా పసిగట్టలేకపోవడం నిఘా వైఫల్యమేనన్న విమర్శలు వెల్లువెత్తాయి. లగచర్ల ఘటన అనంతరం అరెస్టులు, పోలీసుల మోహరింపులతో పరిస్థితి ఇంకా ఉద్రిక్తంగానే ఉన్నది. అర్ధరాత్రి వేళ రేవంత్ సర్కార్ అండతో పోలీసులు చేసిన దమనకాండతో రాష్ట్రం అట్టుడికింది. దీంతో బాధితులకు బీఆర్ఎస్ అండగా నిలిచింది. వారిని జాతీయ మానవ హక్కుల కమిషన్ దగ్గర వరకూ తీసుకెళ్లింది. ఈ క్రమంలోనే ఎన్‌హెచ్ఆర్సీ దీనిపై విచారణ కూడా చేపట్టింది. ఇలాంటి సమయంలో రాష్ట్ర ప్రభుత్వం వెనక్కి తగ్గడం గమనార్హం.



సూర్య www.suryaa.com EVENING EDITION 4 PM




## కదులుతున్న అంబులెన్స్‌లో బాలికపై గ్యాంగ్ రేప్

మధ్యప్రదేశ్‌లోని మౌగాంజ్ జిల్లాలో దారుణం జరిగింది. ఓ బాలిక(16)ను కిడ్నాప్ చేసి కదులుతున్న ప్రభుత్వ అంబులెన్స్‌లో ఇద్దరు అత్యాచారం చేశారు. అనంతరం ఆమెను రోడ్డుపై వదిలేసి పరారయ్యారు. ఈ నెల 25న ఈ ఘటన జరగగా బాలిక ఫిర్యాదుతో ఈ దురాగతం వెలుగులోకి వచ్చింది. నిందితులైన అంబులెన్స్ డ్రైవర్ వీరేంద్ర చతుర్వేది, అతని స్నేహితుడు రాజేశ్ కేతవ్‌లను పోలీసులు అరెస్టు చేశారు.

## 'తెలంగాణ' ఇవ్వలేదు.. సాధించుకున్నాం: కేటీఆర్

తెలంగాణ రాష్ట్రం ఎవరో ఇవ్వడం వల్ల ఏర్పడలేదని, కేసీఆర్ నాయకత్వంలో ప్రజలందరం ఉద్యమించి సాధించుకున్నామని కేటీఆర్ అన్నారు. 15 ఏళ్ల క్రితం తెలంగాణ రాష్ట్ర సాధన కోసం కేసీఆర్ ఆమరణ నిరాహార దీక్ష చేపట్టారని, ఆనాడే డూ ఆర్ డై ఉద్యమం ప్రారంభమైందని గుర్తు చేసుకున్నారు. కేసీఆర్ నాయకత్వం తమకు, రాబోయే తరాలకు స్ఫూర్తి అని ట్వీట్ చేశారు.

## భారీగా పడిపోయిన ఉష్ణోగ్రతలు.. వణికిస్తున్న చలి

ఏపీలో ఉష్ణోగ్రతలు గణనీయంగా పడిపోయాయి. ముఖ్యంగా మన్యంలో చలి పంజా విసురుతోంది. గత ఏడాది నవంబర్ 10-30 తేదీల్లో 13-13.5 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవగా, ఈసారి మరో 5డిగ్రీలు తగ్గిపోయాయి. నిన్న డుంబ్రిగూడలో 8.6, జి.మాడుగుల, జీకే వీధిలో 8.7, హుకుంపేటలో 8.8, అరకులోయలో 9.1డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. వృద్ధులు, గర్భిణులు జాగ్రత్తగా ఉండాలని, ఉదయం, సాయంత్రం బయటికెళ్లొద్దని అధికారులు సూచిస్తున్నారు.



## తెలంగాణ ప్రజల అభిమానం మాత్రం

# కేసీఆర్‌కే ఉంది

బీఆర్ఎస్ పార్టీకి పునర్జన్మ ఇచ్చింది కరీంనగర్ అని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర సమితికి జన్మస్థలం కరీంనగర్ అని తెలిపారు. కరీంనగర్ జిల్లా అలుగునూరు చౌరస్తాలో శుక్రవారం నిర్వహించిన దీక్షా దివస్ కార్యక్రమానికి కేటీఆర్ హాజరై ప్రసంగించారు. రాష్ట్రంలోని పరిస్థితుల కారణంగా మరోసారి పోరాట బాట పట్టాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు.తెలంగాణ ఉద్యమంలో కేసీఆర్ కృషి అనన్య సామాన్యమైనదని కేటీఆర్ కొనియాడారు. కేసీఆర్ పదవులు ఆశించకుండా తెలంగాణ కోసం కృషి చేశారని తెలిపారు. కేసీఆర్ అనేది పేరు కాదు.. తెలంగాణ పోరు అని పేర్కొన్నారు. కేసీఆర్ పోరాటంతోనే తెలంగాణ సాధించామని తెలిపారు. కానీ ఆనాడు ఉద్యమంలో అడ్రస్ లేని వాళ్లు ఇవాళ తెలంగాణ గురించి మాట్లాడుతున్నారని విమర్శించారు. ఆనాడు ఉద్యమంలో మన మీదకు తుపాకీ తీసుకొచ్చినోడు ఇవాళ మాట్లాడుతున్నాడని రేవంత్ రెడ్డిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సోనియా గాంధీ తెలంగాణ ఇవ్వకపోతే మీరు నాంపల్లి దర్గా దగ్గర అడుక్కుతినే వాళ్లని తెలంగాణ ప్రజల గురించి మాట్లాడుతున్నారని అన్నారు.రేవంత్ రెడ్డి ఇవాళ అదృష్టవంతుడు.. అధికారం ఆయన దగ్గర ఉందని కేటీఆర్ అన్నారు. అధికారం నీ దగ్గర ఉండొచ్చు కానీ.. తెలంగాణ ప్రజల అభిమానం మాత్రం కేసీఆర్‌కు, గులాబీ జెండాకే ఉందని స్పష్టం చేశారు. ఆరు గ్యారంటీలు, 420 హామీలు ఇచ్చి అరచేతిలో వైకుంఠం చూపించారని కాంగ్రెస్ నాయకులపై మండిపడ్డారు. దొంగ మాటలు, నంగనాచి కబుర్లు చెప్పి నువ్వు గెలవచ్చు కానీ.. ఏ రోజుకైనా తెలంగాణ చరిత్ర రాసిన రోజు కేసీఆర్ హిమాలయ పర్వతమంతా ఎత్తులో ఉంటే.. కనీసం ఆయన కాలి గోటికి కూడా సరిపోని పాత్రలో ఉంటావనేది అక్షర సత్యమని చెప్పారు. దమ్ముంటే నీ ఏడాది పాలనపై ప్రజలు ఏమనుకుంటున్నారో తెలుసుకునేందుకు రాష్ట్రంలోని ఏ ఊరికైనా, ఏ తండాకైనా, ఏ బస్తీకైనా వెళ్లమని సవాలు విసిరారు.కాంగ్రెస్ ఏడాది పాలనతో తెలంగాణలో ఏ ఒక్క వర్గం కూడా సంతోషంగా లేరని కేటీఆర్ అన్నారు. ఆఖరకు గురుకులాల్లో ఉండే పిల్లలు కూడా ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి వచ్చిందని విమర్శించారు. హాస్టల్‌లో బువ్వ తిని ఆస్పత్రి పాలయ్యే పరిస్థితి ఉందని మండిపడ్డారు. హాస్టల్ విద్యార్థులు తిండి కోసం అలమటిస్తున్నారని అన్నారు. ఇది ఏడాది పాలనలో రాష్ట్ర పరిస్థితి అని అన్నారు. ఈ పాటి దానికి విజయోత్సవాలు చేసుకుంటున్నారని మండిపడ్డారు. వచ్చే నాలుగేళ్లు ప్రజల పక్షాన ఉద్యమిద్దామని బీఆర్ఎస్ శ్రేణులకు కేటీఆర్ పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలయ్యే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ప్రజలకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని తెలిపారు.




## 'బచ్చల మల్లి' మూవీ టీజర్

అల్లరి నరేష్ హీరోగా నటిస్తున్న మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్ చిత్రం 'బచ్చల మల్లి'. 'సోలో బ్రతుకే సో బెటర్' ఫేమ్ సుబ్బు మంగాదేవి దర్శకత్వంలో హాస్య మూవీస్ బ్యానర్‌పై రాజేష్ దండా, బాలాజీ గుత్తా నిర్మిస్తున్నారు. డిసెంబర్ 20న ఈ చిత్రాన్ని విడుదల చేయబోతున్నట్లుగా ఇప్పటికే మేకర్స్ అధికారికంగా ప్రకటించిన విషయం తెలిసిందే. తాజాగా ఈ మూవీ టీజర్‌ని మేకర్స్ వదిలారు.

## గుండెపోటుతో మైదానంలోనే క్రికెటర్ మృతి

ఓ క్రికెటర్ గుండెపోటు రావడంతో.. మైదానంలోనే కుప్పకూలి ప్రాణాలు వదిలాడు. ఈ ఘటన పుణెలో జరిగింది. నగరంలోని గర్వారి స్టేడియంలో గురువారం జరిగిన మ్యాచ్‌లో.. ఈ ఘటన చోటుచేసుకున్నది. 35 ఏళ్ల బ్యాటర్ ఇమ్రాన్ పటేల్ అకస్మాత్తుగా గుండె నొప్పితో కుప్పకూలాడు. ఓపెనర్‌గా వెళ్లి బ్యాటింగ్ చేస్తున్న సమయంలో.. ఇమ్రాన్ పటేల్ తన ఛాతిలో నొప్పి వస్తున్నట్లు పేర్కొన్నాడు. అంపైర్లకు ఆ విషయాన్ని చెప్పాడు. ప్లేయర్లు కొంత సేపు ఆట నిలిపివేశారు. ఆ తర్వాత మైదానం బయటకు వెళ్తున్న సమయంలో అతను కుప్పకూలాడు. హుటాహుటిన అతన్ని ఆస్పత్రికి తీసుకెళ్లారు. కానీ అప్పటికే ఇమ్రాన్ పటేల్ మృతిచెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. మ్యాచ్‌ను లైవ్ స్ట్రీమ్ చేస్తున్న నేపథ్యంలో.. ఆ ఘటన కెమెరాలకు చిక్కింది. బ్యాటర్ ఇమ్రాన్ పటేల్ కిందపడిపోగానే, ప్లేయర్లు అందరూ అతని వైపు పరుగులు తీశారు.


## అతనే పర్‌ఫెక్ట్ మ్యాన్

ఈ ఏడాది మార్చిలో చిరకాల స్నేహితుడు మాథిస్‌బోను పెళ్లాడింది పంజాబీ భామ తాప్సీ. కొద్దిమంది కుటుంబ సన్నిహితుల సమక్షంలో రాజస్థాన్ ఉదయ్‌పూర్‌లో వారి వివాహం జరిగింది. తన పెళ్లి గురించి ఇప్పటివరకు ఎలాంటి విశేషాలను పంచుకోలేదు తాప్సీ. తాజాగా ఇచ్చిన ఇంటర్వ్యూలో వివాహంతో పాటు తన భర్త మాథిస్‌బో గురించి ఆసక్తికరమైన విషయాలను వెల్లడించింది. కాలేజీ రోజుల నుంచి తాను కొంతమంది అబ్బాయిలతో డేటింగ్ చేశానని, అయితే మాథిస్‌బోలో తాను పర్‌ఫెక్ట్‌మ్యాన్‌ను చూశానని తాప్సీ పేర్కొంది. 'మాది ఒక్కరోజులో చిగురించిన ప్రేమకాదు. ఒకరినొకరు అర్థం చేసుకోవడానికి చాలా సమయం పట్టింది. మాథిస్‌తో చేసిన ప్రయాణంలో నేను చాలా సెక్యూర్డ్‌గా ఫీలయ్యాను. అతను బ్యాడ్మింటన్ ప్లేయర్ కాబట్టి ఎప్పుడూ పాజిటివ్ ధృక్పథంతో కనిపించేవాడు. సవాళ్లను స్వీకరించడానికి ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండే మనస్తత్వం అతనిది.



## ట్రంప్ జాగ్రత్తగా ఉండాలి: పుతిన్

అమెరికా అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించనున్న డొనాల్డ్ ట్రంప్ మరింత జాగ్రత్తగా ఉండాలని రష్యా అధ్యక్షుడు పుతిన్ అన్నారు. ఎన్నికల ముందు ఆయనపై హత్యా ప్రయత్నాలు పూర్తిగా అనాగరికమని చెప్పారు. ప్రస్తుతం ఆయన సురక్షితంగా లేరని తెలిపారు. ఎన్నికల ప్రచారం జరిగిన తీరు తనను దిగ్భ్రాంతికి గురి చేసిందని పేర్కొన్నారు. అయితే ట్రంప్ ఇంటెలిజెంట్ అని, తాను చెప్పేది అర్థం చేసుకుంటారని ఆశిస్తున్నానన్నారు.





## అదుపుతప్పి హైవే బ్రిడ్జి అంచుపైకి ఆర్టీసీ బస్సు.. ప్రయాణికులకు గాయాలు

జాతీయ రహదారి 161పై ఆర్టీసీ బస్సు ప్రమాదానికి గురైంది. సంగారెడ్డి జిల్లా ఆందోల్ మండలం కన్సాన్ పల్లి దగ్గర శుక్రవారం ఉదయం ఈ ఘటన చోటుచేసుకుంది. ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో 60 మంది ప్రయాణికులు ఉన్నారు. అయితే బస్సు బ్రిడ్జి రెయిలింగ్ పైకి ఎక్కి ఆగిపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ప్రమాద సమాచారం అందిన వెంటన పోలీసులు ఘటనా ప్రాంతానికి చేరుకున్నారు. గాయపడిన ప్రయాణికులను జోగిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉందని అన్నారు. ప్రమాదం నుంచి సురక్షితంగా బయటపడిన ప్రయాణికులను వేరే బస్సుల్లో వారి గమ్య స్థానాలకు చేర్చారు.

## అరేబియా సముద్ర జలాల్లో 500 కిలోల డ్రగ్స్ స్వాధీనం

అరేబియా సముద్ర జలాల్లో భారీగా డ్రగ్స్ పట్టుబడ్డాయి. భారత్ – శ్రీలంక నౌకాదళాలు సంయుక్తంగా నిర్వహించిన ఆపరేషన్‌లో రెండు పడవల్లో అక్రమంగా తరలిస్తున్న 500 కిలోల డ్రగ్స్‌ను అధికారులు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. శ్రీలంక జెండాతో కూడిన రెండు ఫిషింగ్ బోట్లలో అక్రమంగా తరలిస్తున్న డ్రగ్స్‌ను సీజ్ చేసినట్లు ఇండియన్ నేవీ తెలిపింది. నవంబర్ 24, 25 తేదీల్లో నిర్వహించిన ఆపరేషన్‌లో 500 కిలోల క్రిస్టల్ మెత్‌ను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించింది. ఈ బోట్లను గుర్తించేందుకు విస్తృత ఏరియల్ సెర్చ్ నిర్వహించినట్లు పేర్కొంది. డ్రగ్స్ అక్రమ రవాణా చేస్తున్న రెండు బోట్లను, అందులోని సిబ్బందితో పాటు సీజ్ చేసిన డ్రగ్స్‌ను శ్రీలంకకు అప్పగించినట్లు వెల్లడించింది.



## 3 గంటలకు పైగా రన్ టైమ్ ఉన్న చిత్రాలివే..

అల్లు అర్జున్, సుకుమార్ కాంబినేషన్లో తెరకెక్కిన 'పుష్ప-2' రన్ టైమ్ 3 గంటలకుపైనే అని తెలుస్తోంది. తెలుగులో అత్యధిక రన్ టైమ్ కలిగిన చిత్రంగా దానవీరశూరకర్ణ(3.46 గం.) ఉంది. ఆ తర్వాత లవకుశ(3.28 గం.), పాండవ వనవాసం(3.18గం.), పాతాళ భైరవి(3.15గం.) వంటి చిత్రాలు నిడివి ఎక్కువగా ఉండి అప్పట్లో సంచలనాలు సృష్టించాయి. ఈ మధ్యకాలంలో వచ్చిన అర్జున్ రెడ్డి, RRR వంటి సినిమాల రన్ టైమ్ 3 గంటలకుపైనే కావడం గమనార్హం.

